www.prajasakti.com

ప్రజాశక్తి

బుధవారం 5 నవంబర్ 2025

5

తూర్పుగోదావరి



## జిజిహెచ్ సూపరింటెండెంట్‌గా సత్యనారాయణ




ప్రజాశక్తి - రాజమహేంద్ర వరం రూరల్

రాజమహేంద్రవరంలోని ప్రభుత్వ వైద్య కళాశాలలో జనరల్ మెడిసిన్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్న డాక్టర్ పివివి.సత్యనారాయణ రాజమహేంద్రవరం జిజిహెచ్ సూపరింటెండెంట్‌గా నియమితులయ్యారు. ఇప్పటి వరకు సూపరింటెండెంట్‌గా బాధ్యతలు నిర్వహించిన సౌభాగ్యలక్ష్మి ఉద్యోగ విరమణ నేపథ్యంలో ఆమె స్థానంలో సత్యనారాయణను నియమించారు. ఈ సందర్భంగా ఆయన క్యాంపు కార్యాలయంలో కలెక్టర్ కీర్తి చేకూరిని మర్యాద పూర్వకంగా కలిశారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు పనిచేయాలని కలెక్టర్ ఆయనకు సూచించారు.

# రాలిన విద్యాకుసుమాలు

- ఒకే రోజు ముగ్గురు విద్యార్థుల బలవన్మరణం
- తునిలో 10వ తరగతి విద్యార్థి, రాజమండ్రిలో ఇంటర్ విద్యార్థి, రామచంద్రపురంలో 5వ తరగతి విద్యార్థిని ఆత్మహత్య
- అందరూ ప్రయివేటు విద్యాసంస్థల విద్యార్థులే
- యాజమాన్యాల ఒత్తిళ్లే కారణం?



విద్యా బుద్ధులు నేర్చుకుని వికసించాల్సిన విద్యాకుసుమాలు బలవంతంగా నేలరాలాయి. కన్నవారికి కన్నీటిని మిగిల్చాయి. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో మంగళవారం ఒక్కరోజే ముగ్గురు విద్యార్థులు బలవన్మరణాలకు పాల్పడటం చర్చనీయాంశమైంది. ప్రయివేటు విద్యాసంస్థల్లో చదువుతున్న వీరు... ఒత్తిళ్లను తాళలేక తనువు చాలించినట్టు ప్రాథమికంగా నిర్ధారణ అయ్యింది.. ఇందులో ఐదో తరగతి విద్యార్థిని సైతం ఆత్మహత్యకు పాల్పడటం చర్చనీయాంశమైంది.

ప్రజాశక్తి - కోటనందూరు, గొల్లప్రోలు, రామచంద్రపురం

కాకినాడ జిల్లాకు చెందిన ఇద్దరు విద్యార్థులు ఆత్మహత్యకు పాల్పడ్డారు. తుని పట్టణంలో పదో తరగతి విద్యార్థి, రాజమహేంద్రవరంలో జూనియర్ కళాశాల విద్యార్థి ఈ ఘాతుకానికి పాల్పడ్డారు. ఈ రెండు ఘటనల్లోనూ చదువు ఒత్తిడే కారణంగా పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. పోలీసులు కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు... తుని రూరల్ లోవకొత్తూరు పంచాయతీ పరిధిలోని సీతయ్యపేటకు చెందిన కోండ్రు కార్తీక్(15)



రోదిస్తున్న కార్తీక్ తల్లిదండ్రులు, బంధువులు

తునిలోని ఓ ప్రయివేటు పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. పాఠశాలకు చెందిన హాస్టల్‌లోనే ఉంటూ తరగతులకు హాజరవుతున్నాడు. సోమవారం రాత్రి స్టడీ రూమ్‌లో ఉరేసుకుని చనిపోయాడని స్కూల్ యాజమాన్యం విద్యార్థి తల్లిదండ్రులకు సమాచారం అందించింది. దీనిపై కార్తీక్ తండ్రి శ్రీను పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు ఘటనా ప్రాంతాన్ని పరిశీలించారు. ఒత్తిడి తట్టుకోలేక ఆత్మహత్య చేసుకుని ఉంటాడని ప్రాథమికంగా అంచనా వేశారు. మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం ఏరియా ఆసుపత్రికి తరలించారు.

కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం చెందుర్తికి చెందిన యాళ్ల సత్యదేవ్‌కుమార్(18) తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని ఒక ప్రయివేటు విద్యాసంస్థలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. ఇటీవలే సత్యదేవ్‌కుమార్ ఇంటికి వచ్చాడు. మంగళవారం సత్యదేవ్‌ను తండ్రి ప్రసాద్ కళాశాలలో దింపి ఇంటికి వచ్చాడు. అంతలోనే కాలేజీలో సత్యదేవ్‌కుమార్ ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్టుగా కాలేజీ యాజమాన్యం తెలిపింది. వెంటనే వారు తిరిగి రాజమహేంద్రవరం బయలుదేరారు. పోలీసులు ఈ మేరకు కేసు నమోదు చేశారు. మృతికి గల కారణాలు ఇంకా తెలియాల్సి వుంది

డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం పట్టణానికి చెందిన సిర్రా రంజిత పట్టణంలోని ఒక ప్రయివేటు స్కూల్లో ఐదో తరగతి చదువుతోంది. మంగళవారం ఆమె ఇంట్లో చున్నీతో ఉరి వేసుకుని రంజిత(10) ఆత్మహత్య చేసుకుంది. ఈ మేరకు కేసు నమోదు చేసినట్టు రామచంద్రపురం ఎస్ఐ నాగేశ్వరరావు తెలిపారు. దర్యాప్తు చేస్తున్నామని త్వరలోనే వివరాలు వెల్లడిస్తామని వారు చెబుతున్నారు.

### ప్రయివేటు విద్యాసంస్థల ఒత్తిళ్లు

విద్యార్థుల మరణాలకు ప్రధాన కారణం ఒత్తిళ్లేనని పోలీసులు సైతం నిర్ధారించారు. ప్రయివేటు, కార్పొరేట్ విద్యాసంస్థలు అవలంభిస్తున్న విధానాలే దీనికి కారణంగా కనిపిస్తున్నాయి. ర్యాంకులు, మార్కులే పరమావధిగా ప్రయివేటు విద్యాసంస్థలు వ్యవహరిస్తున్నాయి. ఉదయం 7 గంటల నుంచి రాత్రి 12 గంటల వరకూ విద్యార్థులను చదువు పేర ఒత్తిళ్లకు గురి చేస్తున్నాయి. డైలీ, వీక్లీ, మంత్లీ పరీక్షలతో పాటూ స్టడీ అవర్లు అంటూ వేధిస్తున్నాయి. కొన్ని విద్యాసంస్థలు ఎలాంటి అనుమతులు కూడా లేకుండా హాస్టళ్లను సైతం నిర్వహిస్తూ విద్యార్థులను ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. మార్కులు తక్కువ వస్తే తీవ్రంగా మందలించడంతో పాటూ విద్యార్థుల తల్లిదండ్రులకు యాజమాన్యాలు ఫిర్యాదులు చేస్తున్నాయి. దీంతో విద్యార్థులు భయాందోళనకు గురై మానసిక వేదనకు గురవుతున్నారు. జిల్లాలో ఉన్న పలు ప్రముఖ విద్యాసంస్థలన్నీ ఇవే కోవలోకి వస్తాయి. సెలవుల్లో సైతం తరగతులు నిర్వహిస్తున్న దాఖలాలు కోకొల్లలు. దీనిపై విద్యార్థి సంఘాలు గొంతెత్తినా అధికారులు చర్యలు శూన్యం. తుని, రాజమహేంద్రవరంలో జరిగిన ఈ రెండు ఘటనల్లోనూ విద్యార్థులు తీవ్ర ఒత్తిళ్లకు లోనైనట్టు స్నేహితులు చెబుతున్నారు. ఇంటి దూరంగా ఉండటంతో ఒంటరితనానికి లోనవుతున్నారు. లక్షలు ఖర్చు చేస్తున్న తల్లిదండ్రులను బాధపెట్టలేక, యాజమాన్య వేధింపులు భరించలేక తనువును అర్ధాంతరంగా చాలిస్తున్నారు.



మాట్లాడుతున్న ఎంఎల్ఎ వెంకట్రాజు

## క్రీడల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

ప్రజాశక్తి - దేవరపల్లి

క్రీడల అభివృద్ధికి ప్రభుత్వం విశేష కృషి చేస్తుందని ఎంఎల్ఎ మద్దిపాటి వెంకట్రాజు అన్నార. దేవరపల్లిలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి ఫుట్‌బాల్ క్రీడా ఎంపికలను ఆయన మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ క్రీడలలో మానసిక దృఢత్వం, శారీరక సామర్థ్యం, నైపుణ్యాలను పెంపొందించుకోవచ్చు. క్రీడల ద్వారా సమాజంలో ఐక్యతా భావం పెరుగుతుందన్నారు. సిఎం చంద్రబాబు క్రీడలకు ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. స్పోర్ట్స్ కోటాలో 423 మందికి తమ ప్రభుత్వం ఉద్యోగాలు కల్పించిందన్నారు. గోపాలపురం నియోజకవర్గాన్ని క్రీడలకు అనువైన ప్రాంతంగా తీర్చిదిద్దుతామన్నారు. అనంతరం ఫుట్‌బాల్ కోర్టును ప్రారంభించి, దాతలు అందించిన టీ షర్టులను క్రీడాకారులకు పంపిణీ చేశారు. అలాగే దేవరపల్లి మండలంలో కొత్తగా బాధ్యతలు స్వీకరించిన 14 మంది వ్యాయామ ఉపాధ్యాయులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో శాప్ డైరెక్టర్ రవీంద్రనాథ్, జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ డి.సువర్ణరాజు, టిడిపి మండల అధ్యక్షులు ఆండ్రు అనిల్, టిడిపి నాయకులు హరికృష్ణ, సొసైటీ చైర్మన్ ఉప్పులూరి రామారావు, డివైఇఒ సుధాకర్, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ సెక్రటరీలు అలివేలు, సునీత, హెచ్ఎం సూర్యనారాయణ, వ్యాయామ ఉపాధ్యాయులు ఓరుగంటి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## సైబర్ నేరాలపై బుర్రకథ ద్వారా అవగాహన

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్



మాట్లాడుతున్న ధర్మరాజు

ధవళేశ్వరం పెన్షనర్స్ అసోసియేషన్ సభ్యులకు సైబర్ నేరాలపై బుర్రకథ ద్వారా అవగాహన కల్పించారు. పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు యర్రమోతు. ధర్మరాజు ధవళేశ్వరం ఎస్‌బిఐ మేనేజర్ బి.అరుణ్‌కుమార్ సౌజన్యంతో అసోసియేషన్ భవన్‌లో ఈ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వ హించారు. ధర్మరాజు మాట్లాడుతూ అపరిచిత వ్యక్తులకు ఎటిఎం కార్డు ఇవ్వడం, కార్డు కవర్‌పై పిన్ నెంబర్ రాయడం వంటివి చేయరాదన్నారు. ఎటిఎం కార్డు, పిన్ నెంబర్లు, ఒటిపిలను ఎవరు అడిగినా చెప్పకూడదన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి దువ్వూరి కామేశ్వరశర్మ, కోశాధికారి ఉర్రింకల. సత్యనారాయణ, వి.వెంకటేశ్వర్లు, బి.రవీంద్ర, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు, ఇటీవల ఇరిగేషన్ ఎంప్లాయీస్ కోపరేటివ్ సొసైటీ డైరెక్టర్‌గా ఎన్నికైన తోరం కేశవరావుని ఈ సందర్భంగా సత్కరించారు.



## హాస్టల్‌ను సందర్శించిన జడ్జి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

నగరంలోని ప్రభుత్వ బాలుర వసతి గృహాన్ని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎన్.శ్రీలక్ష్మి మంగళవారం సందర్శించారు. అక్కడి వసతులను పరిశీలించారు. బాలురతో మాట్లాడి వారి బాగోగులను అడిగి తెలుసుకున్నారు. వారి విద్యా పరిస్థితులు, ఉపాధ్యాయులు బోధిస్తున్న పాఠాలపై వివరాలు సేకరించారు. వ్యసనాలకు, చెడు స్నేహాలకు దూరంగా ఉంటూ బాగా చదువుకోవాలని సూచించారు. క్రమశిక్షణ, సహనశీలత మనిషి జీవితంలో అత్యంత ముఖ్యమైన లక్షణాలన్నారు. వీటిని అలవరుచుకున్న వారే మంచి స్థాయికి చేరుకుంటారని తెలిపారు. ఉచిత న్యాయ సేవలను పొందడం ప్రతి పౌరుడి హక్కు అని గుర్తు చేశారు. ఎటువంటి సమస్యలున్నా జిల్లా న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించొచ్చని తెలిపారు.

## సిఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

ప్రజాశక్తి - చాగల్లు

మండలంలో ఊనగట్ల, కలవలపల్లి, మార్కొండపాడు, చాగల్లు, దారవరం గ్రామాలకు చెందిన ఆరుగురికి మంజూరైన సిఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఎంఎల్ఎ ముప్పిడి వెంకటేశ్వరరావు మంగళవారం అందించారు. రూ.3,34,498 విలువైన చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి చైర్మన్ నాదాల శ్రీరామ్‌చౌదరి, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు

### కార్టూ'నిజం'




## ఉత్సాహంగా చెకుముకి పోటీలు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

జెవివి ఆధ్వర్యంలో మండల స్థాయి చెకుముకి పోటీలు మంగళవారం ఉత్సాహంగా జరిగాయి. రాజమహేంద్రవరం అర్బన్, రూరల్ మండల స్థాయి పోటీలు ఎస్‌కెవిటి ఉన్నత పాఠశాలలో జెవివి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.భీమయ్య, ఎన్.రవిబాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా అర్బన్ ఎంఇఒ బి.దిలీప్‌కుమార్ హాజరై మాట్లాడారు. విద్యార్థులు శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించుకోవాలన్నారు. అనంతరం విజేతలను అభినందించారు. హెచ్ఎం సుబ్రహ్మణ్యంతో కలిసి ఆయన విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. రాజమహేంద్రవరం అర్బన్ ప్రభుత్వ పాఠశాలల విభాగంలో నెహ్రూ నగర్ మున్సిపల్ హైస్కూల్ విద్యార్థులు ప్రథమ, షాడే ఇంగిష్ మీడియం స్కూల్ విద్యార్థులు ద్వితీయ, శ్రీనాగరాజు మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్ విద్యార్థులు తృతీయ స్థానంలో నిలిచారు. కంటిపూడి రామారావు మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్ విద్యార్థులకు ప్రత్యేక బహుమతి దక్కింది. ప్రయివేటు పాఠశాలల విభాగంగా గాంధీపురం శ్రీగౌతమి విద్యార్థులు, ద్వితీయ స్థానంలో శ్రీరామ్‌నగర్ శ్రీగౌతమి విద్యార్థులు, తృతీయ బహుమతిని ప్రతిభ నెక్స్ట్ జెన్ విద్యార్థులు గెలుచుకున్నారు. ప్రగతి ఇంగ్లీష్ మీడియి సూల్ విద్యార్థులకు ప్రత్యేక బహుమతి దక్కింది. రాజమహేంద్రవరం రూరల్‌లో శాటిలైట్ సిటీ జడ్‌పి ఉన్నత పాఠశాల మొదటి, కాతేరు జడ్‌పి ఉన్నత పాఠశాల ద్వితీయం, కోలమూరు జడ్‌పి ఉన్నత పాఠశాల విద్యార్థులు తృతీయ స్థానంలో నిలిచారు. హుకుంపేట జడ్‌పి ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రత్యేక బహుమతి గెలుచుకున్నారు. ఈ కార్యక్రమంలో జెవివి నాయకులు జీ.తాతారావు, చెక్క తాతారావు, సిహెచ్.నిశ్చల్, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.



కడియంలో...



విజేతలతో దిలీప్‌కుమార్, జెవివి నాయకులు

**కడియం :** జెవివి అధ్వర్యంలో కడియం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన చెకుముకి పరీక్ష విజయవంతగా ముగిసింది. ప్రైవేట్ పాఠశాలల విభాగంలో కడియం శ్రీ ఆదిత్య ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థులు, ప్రభుత్వ పాఠశాలల విభాగంలో వేమగిరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రధమ స్థానం సాధించారు. జెవివి నాయకులు తోరాటి వసంతరావు, బిఎస్‌వి.ప్రసాదరావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమాన్ని కడియం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం టి.సత్యనారాయణ, జిల్లా సైన్స్ అధికారి జివిఎన్ఎస్.నెహ్రూ, కడియం ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు రవిశంకర్, ప్రసాద్ బాబు, సతీష్, కడియం ప్రభుత్వ జూనియర్ కళాశాల లెక్చరర్ బినాగేశ్వరరావు, వివిధ ఉన్నత పాఠశాల ల ఉపాధ్యాయులు పర్యవేక్షించారు.

## హాస్టల్‌లో తహశీల్దార్ తనిఖీలు

**పెరవలి :** మండలంలోని కానూరులోని సాంఘిక సంక్షేమ బిసి బాలికల హాస్టల్‌ను మంగళవారం తహశీల్దార్ కె.నిరంజన్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం విద్యార్థుల హాజరును పరిశీలించారు. భోజనం, మెనూ పై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట రెవెన్యూ అధికారి, విఆర్ఒ, సిబ్బంది ఉన్నారు.

## వైసిపి ఆధ్వర్యంలో కోటి సంతకాల సేకరణ

**సీతానగరం :** మండలంలోని బొబ్బల్లంక, ములకల్లంక గ్రామాల్లో వైసిపి ఆధ్వర్యంలో కోటి సంతకాల సేకరణను మంగళవారం నిర్వహించారు. మెడికల్ కళాశాలలను ప్రయివేటు పరం చేయడాన్ని నిరసిస్తూ ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైసిపి నాయకులు రమేష్ బాబు మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా వైసిపి చేపట్టిన కోటి సంతకాలను పార్టీ అధిష్టానం ద్వారా గవర్నర్‌కు అందిస్తామన్నారు. మెడికల్ కాలేజీల ప్రయివేటీకరణ వల్ల పేద విద్యార్థులు వైద్య విద్యకు దూరమవుతారన్నారు.

## ప్రజలకు అందుబాటులో ఉండాలి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

అధికారులు ఎప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉండాలని ఎంఎల్ఎ గోరంట్ల బుచ్చయ్య చౌదరి అన్నారు. మంగళవారం ఎంఎల్ఎ కార్యాలయంలో ఎంపిడిఒ సునీల్‌ఆర్మ్‌స్ట్రాంగ్, రూరల్ మండలంలోని పంచాయతీ కార్యదర్శులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీల వారీగా వసూలు చేయాల్సిన బకాయిలు, ఖర్చులు, ఇతర పాలనా అంశాలపై సమీక్షించారు. అధికారులు తరచూ గ్రామాలను సందర్శించాలన్నారు. పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. పారిశుధ్య కార్మికులకు ప్రతి నెలా వేతనాలు అందేలా చూడాలన్నారు. గ్రామాల్లో ఇప్పటి వరకూ వేసిన సిసి రోడ్లు, డ్రెయినేజీలు, ఇతర పనులకు సంబంధించిన బిల్లుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. అత్యవసరంగా పూర్తి చేయాల్సిన పనులకు అంచనాలు సిద్ధం చేయాలన్నారు.

## 471 మంది విద్యార్థులకు నేత్ర వైద్య పరీక్షలు

ప్రజాశక్తి-గోకవరం

మండలంలోని భూపతి పాలెం ప్రభుత్వ గురుకుల పాఠశాలలో ప్రిన్సిపల్ పి.సోమసత్యశేఖర్ ఆధ్వర్యంలో అప్తాలమిక్ ఆఫీసర్ సిహెచ్.ఆనందరావు 471 మందికి విద్యార్థులు నేత్ర వైద్య పరీక్షలు నిర్వహించారు. 35 మంది విద్యార్థులు దృష్టి లోపం ఉన్నట్లు గుర్తించారు. వీరందరికీ త్వరలో కళ్ళజోళ్ళు పంపిణీ చేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్లాస్ రూంలో ఎక్కువ సమయం గడుపుతారు కాబట్టి ఉపాధ్యాయులు దృష్టి లోపాలను గమనించాలని సూచించారు. అనంతరం నేత్రదానంపై విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో హాస్టల్ నర్స్ జి.గ్రేస్, ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## సీతానగరంలో ఉపాధి గ్రామసభ

ప్రజాశక్తి - సీతానగరం

సీతానగరం గ్రామ పంచాయతీ కార్యాలయంలో టెక్నికల్ అసిస్టెంట్ వీరబాబు ఆధ్వర్యంలో ఉపాధి హామీ పనుల గుర్తింపు గ్రామసభను మంగళవారం నిర్వహించారు. గ్రామ సభలో 15 పంట కాలువలు, రెండు చెరువులు, రెండు మట్టి రోడ్డు నిర్మాణం పనులు, మూడు కంపోస్ట్ పిట్లు, 3 గోకులాలు, 5 ట్రెంచ్ పనులు గుర్తించారు. సర్పంచ్ ముత్యాలు మాట్లాడుతూ పనులు పూర్తి చేసేలా, ఉపాధి కూలీలకు వంద శాతం పని దినాలు కల్పించాలని కోరారు. జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరూ ఇకెవైసి చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కొండ్రపు ముత్యాలు, సెక్రటరీ డివిఎన్.రత్నం, కూటమి నాయకులు మట్టా వెంకటేశ్వరరావు, మట్టా కాపు, బాబు, మట్టా నాగేశ్వరరావు, ముల్లా సుబ్బారావు, ఫీల్డ్ అసిస్టెంట్ కృష్ణవేణి, మేట్లు, కూలీలు పాల్గొన్నారు.

## పోలీస్ స్టేషన్‌లో డిఎస్‌పి తనిఖీలు

ప్రజాశక్తి -దేవరపల్లి

దేవరపల్లి పోలీస్ స్టేషన్‌లో కొవ్వూరు డిఎస్‌పి జి.దేవకుమార్ మంగళవారం తనిఖీ చేశారు. స్టేషన్‌లో రికార్డులను పరిశీలించారు. నేర నియంత్రణ, ప్రజా భద్రత, సిబ్బంది పనితీరుపై సమగ్రంగా సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నేర నియంత్రణలో భాగంగా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. రోడ్డు ప్రమాదాలు జరగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సాయంత్రం సమయాల్లో ఫుట్ పెట్రోలింగ్ నిర్వహించాలని సూచించారు. సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రజలపట్ల గౌరవంగా వ్యవహరించాలన్నారు. ఆయన వెంట ఎస్ఐ వి.సుబ్రహ్మణ్యం, సిబ్బంది ఉన్నారు.

## మత్స్యకారులకు సాయం అందజేత

ప్రజాశక్తి - పెరవలి

ఖండవల్లి పంచాయతీ పరిధిలో ఉన్న లంకమాలపల్లి మధ్యపేటకు చెందిన 27 మత్స్యకార కుటుంబాలకు నిత్యావసరాలను అందించారు. తుపాను నేపథ్యంలో మంజూరు చేసిన 50 కేజీల బియ్యం, నూనె ప్యాకెట్, ఒక్కోకేజీ చొప్పున బంగాళాదుంపలు, కందిపప్పు, అరకేజీ పంచదారను అందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పులిదిండి నాగరాజు, తహశీల్దార్ కె.నిరంజన్, మత్స్య కార సంఘం ప్రెసిడెంట్ కొల్లి వెంకటేశ్వరరావు, నాయకులు శక్తిబాబు, అతికాల శ్రీను, విఆర్ఒలు వైవి.సుబ్బారావు, బివి.సుబ్బారావు, బి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు

**చాగల్లు :** మొంథా తుపాను కారణంగా ఉపాధి కోల్పోయిన48 మంది మత్స్యకారులకు ఎంఎల్ఎ ముప్పిడి వెంకటేశ్వరరావు అందించారు. చాగల్లులోని దళిత పేటలో రేషన్ షాపు వద్ద ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. తహశీల్దార్ ఎం.మెరికమ్మ, ఎంపిడిఒ



సాయం అందిస్తున్న ఎంఎల్ఎ ముప్పిడి వెంకటేశ్వరరావు

ఆర్.శ్రీదేవి, ఎఎంసి చైర్మన్ నాదెళ్ల శ్రీరాంచౌదరి, కూటమి నాయకులు పాల్గొన్నారు.

**కొవ్వూరు :** తుపాను కారణంగా ఉపాధి కోల్పోయిన 120 మంది మత్స్యకారులకు ఎంఎల్ఎ ముప్పిడి వెంకటేశ్వరరావు మంగళవారం నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. బంగారమ్మ పేటలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎంపిపి కాకర్ల నారాయుడు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

## అసెంబ్లీకి ఎస్‌కెవిటి విద్యార్థిని తేజస్విని

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం సిటీ



స్థానిక ఎస్‌కెవిటి ప్రభుత్వ ఉన్నత పాఠశాల 9వ తరగతి విద్యార్థిని పి.తేజస్విని నవంబర్ 26న రాష్ట్ర అసెంబ్లీ సమావేశంలో పాల్గొనేందుకు అర్హత సాధించిందని హెచ్ఎం ఎంవిఎం సుబ్రహ్మణ్యం తెలిపారు. మూడు విడతలుగా జరిగిన పోటీ పరీక్షల్లో ఆమె అర్హత సాధించిందన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యా శాఖ మంత్రి లోకేష్ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అసెంబ్లీని చూపించాలనే ఉద్దేశ్యంతో ఈ అవకాశాన్ని కల్పించారన్నారు. పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ ఎం.దుర్గా ప్రసాద్, మెంటార్ కరీమ్, ఉపాధ్యాయ బందం తేజస్వినిని అభినందించారు.

## అన్నదాతలను ప్రభుత్వమే ఆదుకోవాలి

ప్రజాశక్తి - చాగల్లు

తుపాను వల్ల నష్టపోయిన రైతులను, కౌలు రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కౌలు రైతు జుజ్జువరపు శ్రీనివాసరావు అన్నారు. తుపాను కారణంగా వరి కంకులు నేలకు ఒరిగిపోయాయన్నారు. దీని వల్ల కోతలకు ఎక్కువ సమయం పడుతుందన్నారు. వ్యవసాయంలో కౌలు రైతులే ఎక్కువగా ఉన్నారన్నారు. పంట నమోదు విషయంలో ఎకరాకు పండిన వరిలో ధాన్యం సగమే తీసుకుంటామని ప్రభుత్వం చెబుతుందని, దీని వల్ల కౌలు రైతులు తీవ్రంగా నష్టపోతారన్నారు. అరటి పంటకు సంబంధించి చేను పడలేదు కాబట్టి నష్టపరిహారం నమోదు చేయబోమని అధికారులు అంటున్నారన్నారు. ఒక నెల తరువాత ఒరిగిన అరటి చెట్లు గెలలు రావన్నారు. దీని వల్ల తీవ్ర నష్టం వాటిల్లుతుందన్నారు. ఈనికి దశలో ఉన్న అరటి చెట్లకు పరిహారం చెల్లించాలన్నారు.

## ఆకట్టుకున్న స్టూడెంట్ లెడ్ కాన్ఫరెన్స్

ప్రజాశక్తి - నిడదవోలు

స్థానిక నారాయణ పాఠశాలలో ఒకటి, రెండో తరగతి విద్యార్థులు మంగళవారం నిర్వహించిన స్టూడెంట్ లెడ్ కాన్ఫరెన్స్ కార్యక్రమం ఆకట్టుకుంది. విద్యార్థులు మొదటి సెమిస్టర్‌లో నేర్చుకున్న పాఠ్యాంశాలను తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమక్షంలో అద్భుతంగా ప్రదర్శించారు. విద్యార్థుల్లో నైపుణ్యం, వికాసం, కమ్యూనికేషన్ స్కిల్స్,, ప్రజంటేషన్ స్కిల్స్, నాయకత్వ లక్షణాలు పెంపొందించడమే ఈ కార్యక్రమం ఉద్దేశ్యమని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన ప్రిన్సిపల్ పి.పున్నారెడ్డికి తల్లిదండ్రులు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈ చాంప్స్ ఆర్ అండ్ డి హెచ్.వాణి, కో-అర్డినేటర్ సాహిత్య, ఎజిఎం రామిరెడ్డి, ఆర్ఐ బండారు సురేష్, వైస్ ప్రిన్సిపల్ దుర్గ, విజయ, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

## రాజానగరంలో అమరవీరుల వర్ధంతి సభ

ప్రజాశక్తి - రాజానగరం

రాజానగరం జోగి జగన్నాథ బహుదూర్ అన్నదాన సత్రంలో సిపిఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు జనిపల్లి సత్తిబాబు అధ్యక్షతన విప్లవ అమరవీరుల వర్ధంతి సభ మంగళవారం జరిగింది. పోరాటాల్లో భూస్వామి దాడులలో పోలీస్ ఎన్‌కౌంటర్‌లో అమరులైన వారికి మౌనం పాటించి నివాళులు అర్పించారు. అనరరం ఏర్పాటు చేసిన సభలో న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకులు ఎం.దుర్గాప్రసాద్, పి.వెంకట్‌నాయుడు మాట్లాడారు. అమరులు త్యాగాలను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మేకల లక్ష్మీపతి, గంటా బాలరాజు, గరగ దుర్గారావు, కడియాల దుర్గారావు, కొల్లి సూరిబాబు, నక్క లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## పలుచోట్ల పంట కోత ప్రయోగాలు

ప్రజాశక్తి - చాగల్లు

ఈ ఖరీఫ్ సీజన్‌కు మండలంలో మొత్తం 32 పంట కోత ప్రయోగాలు నిర్వహించాల్సి ఉండగా, ఇప్పటి వరకూ 6 పంట కోత ప్రయోగాలు పూర్తి చేశామని ఎఒ కె.గోపాలకృష్ణ తెలిపారు. మంగళవారం ఆళ్ల హరిబాబు వరి పొలంలో పంట కోత ప్రయోగం నిర్వహించామన్నారు. ఎకరానికి 39 బస్తాలు దిగుబడి వస్తున్నట్లు అంచనా వేశామన్నారు. కొవ్వూరు డివిజన్ ఉప గణాంక అధికారి పి.జయభారతి పర్యవేక్షించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల సహాయ గణాంకాధికారి యు.చిన్ని, వివిఎలు పూర్ణిమ, అశోక్ పోసారావు తదితరులు పాల్గొన్నారు.

## నేరాలు ఘోరాలు

### నిందితునికి జైలు శిక్ష, జరిమానా

**ప్రజాశక్తి - గొల్లప్రోలు**

17 ఏళ్ల అమ్మాయిని కిడ్నాప్ చేసి అత్యాచారం చేసిన కేసులో నిందితునికి ఫోక్సో కోర్టు జడ్జ్ కె.శ్రీదేవి జైలు శిక్ష, జరిమానాను విధించినట్లు సిఐ జి.శ్రీనివాస్ తెలిపారు. పట్టణానికి చెందిన మచ్చ రామ్మోహన్ 2017లో ఒక కేసులో నుండి 17 ఏళ్ల అమ్మాయిని బలవంతంగా తీసుకెళ్లి అత్యాచారం చేసిన ఘటనలో నమోదైన కేసుపై 8 ఏళ్ల అనంతరం కోర్టులో సుదీర్ఘ వాద, ప్రతివాదనల అనంతరం న్యాయమూర్తి తీర్పు నిచ్చారని తెలిపారు. నిందితుడు మచ్చ రామ్మోహన్‌రావుకి ఒక కేసులో పదేళ్ల జైలు, రూ.5000 జరిమానా, మరో కేసులో 11 ఏళ్ల జైలు, రూ.6000 జరిమానాను విధిస్తూ న్యాయమూర్తి తీర్పు ఇచ్చారని అన్నారు. ఈ కేసులో పిపిగా జి.రత్నబాబు వాదనలు వినిపించారు.

### అత్త, వదినలపై కత్తితో దాడి

**ప్రజాశక్తి - ఏలేశ్వరం**

అత్త వదినలపై అల్లుడు కత్తితో విచక్షణారహితంగా దాడి చేసిన సంఘటన మండలంలోని తిరుమాలి గ్రామంలో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్ఐ రామలింగేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం...మండలంలోని తిరుమాలి గ్రామానికి చెందిన రామకుర్తి అప్పలరాజు, సూరిబాబు దంపతులకు ఇద్దరు కుమార్తెలుండగా చిన్న కుమార్తె దుర్గాదేవిని నాలుగేళ్ల క్రితం రాయవరం మండలం వెదురుపాక గ్రామానికి చెందిన పెంటపాటి హరిబాబుతో వివాహం చేశారు. అయితే మనస్పర్థలు కారణంగా వీరిద్దరు విడిగా ఉంటున్నారు. ఈ నేపథ్యంలో హరిబాబు తిరుమాలి గ్రామానికి మంగళవారం రాత్రి మద్యం సేవించి వచ్చి అత్త అప్పలరాజు(45)పై వేట కొడవలితో విచక్షణారహితంగా దాడి చేశాడు. అడ్డు వచ్చిన పెద్ద కుమార్తె కేసనకుర్తి నాగదుర్గాభవానిపై దాడి చేయడంతో ఇద్దరు తీవ్ర గాయాలపాలయ్యారు. స్థానికులు క్షతగాత్రులను ఏలేశ్వరం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకొచ్చారు. అత్త అప్పలరాజు పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యులు హుటాహుటిన కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

### రైతు బజారు వద్ద గుర్తు తెలియని మృతదేహం

**ప్రజాశక్తి - పెరవలి**

పెరవలిలో జాతీయ రహదారి పక్కన ఉన్న రైతు బజార్ షెడ్ వద్ద గుర్తు తెలియని మృతదేహం పడి ఉందని పోలీసులు తెలిపారు. మృతుని వయస్సు 50 నుంచి 50 ఏళ్ల మధ్య ఉండవచ్చునన్నారు. నీలం రంగు గళ్ల పొడవు చేతుల చొక్కా, సిమెంటు రంగు ఫ్యాంటు ధరించి ఉన్నాడన్నారు. మృతుని ఆచూకీ తెలిసిన వారు 9440796642, 7013140882 నెంబర్లను సంప్రదించాలని పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని తణుకు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి మార్చురీకి తరలించామన్నారు.

### అనుమానాస్పద లారీ స్వాధీనం

**ప్రజాశక్తి - సామర్లకోట**

పట్టణ శివారు వేట్లపాలెం వెళ్లే కెనాల్ రోడ్‌లో అనుమానాస్పదంగా వెళుతున్న లారీని రెవెన్యూ, అగ్రికల్చర్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. అనుమానాస్పద లోడుతో లారీ వెళ్తుండగా వచ్చిన సమాచారంతో తహశీల్దార్ కొవ్వూరి చంద్రశేఖర్‌రెడ్డి, అగ్రికల్చర్ ఎడిఎ దుర్గాలక్ష్మి, వ్యవసాయ శాఖ ఎఓ వంగపండు మానికేశ్వరి ఆ వాహనాన్ని అడ్డుకున్నారు. దీంతో లారీని వదిలిపెట్టి డ్రైవర్ పరారయ్యాడు. లారీని తనిఖీ చేయగా లారీలో ఉన్న బస్తాల్లో పొటాషియంగా అధికారులు భావిస్తున్నారు. వాహనాన్ని పోలీసులకు అప్పగించారు. స్వాధీనం చేసుకున్న సరుకును ల్యాబ్‌కు పంపించి తదుపరి చర్యలు తీసుకుంటామని తహశీల్దార్ తెలిపారు.

### పోక్సో కేసులో నిందితుని అరెస్ట్

**ప్రజాశక్తి - కపిలేశ్వరపురం**

అంగర పోలీస్ స్టేషన్ పరిధిలో పోక్సో కేసులో నిందితుడు షేక్ గౌస్ మొహిద్దీన్‌ను సోమవారం పోలీసులు అరెస్ట్ చేశారు. రామచంద్రపురం కోర్టుకు తరలించగా రిమాండ్ విధించినట్లు అంగర ఎస్ఐ జి.హరీష్‌కుమార్ మంగళవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ఇవి.. కపిలేశ్వరపురం మండలం నల్లూరు గ్రామానికి చెందిన ఓ యువతిపై అదే గ్రామానికి చెందిన షేక్ గౌస్ మొహిద్దీన్ లైంగిక దాడికి పాల్పడ్డాడన్న ఆరోపణపై వారం రోజుల క్రితం పోక్సో కేసు నమోదైంది. కేసు దర్యాప్తులో భాగంగా డిఎస్‌పి రఘువీర్ ఆదేశాలపై నిందితుని అరెస్ట్ చేసి రామచంద్రపురం కోర్టుకు హాజరుపర్చగా రిమాండ్ విధించారు.

### అతిగా మద్యం సేవించి వృద్ధుడు మృతి

**ప్రజాశక్తి - సీతానగరం**

అతిగా మద్యం సేవించడంతో వృద్ధుడు మృతి చెందాడు. రఘుదేవపురానికి చెందిన గొలిసే వీర్రాజు (66) ఈ నెల 2న అతిగా మద్యం సేవించాడు. అనంతరం నల్లగొండలో ఉన్న వారి జీడిమామిడి తోటకు సైకిల్‌పై వెళ్లాడు. అక్కడ అస్వస్థతకు గురై పడిపోయాడు. గ్రామస్తులు గుర్తించి కుమారుడు కృష్ణకు సమాచారం అందించారు. వెంటనే కృష్ణ తన తండ్రిని హుటాహుటిన రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. కృష్ణ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

### డీజిల్ కల్తీపై విచారణ

**ప్రజాశక్తి - కాట్రేనికోన**

స్థానిక గేటు సెంటర్లో ఉన్న ఇండియన్ ఆయిల్ కంపెనీకి చెందిన పెట్రోల్ బంకులో డీజిల్ కల్తీపై పోలీసులు, రెవెన్యూ అధికారులు మంగళవారం విచారణ చేశారు. వివరాలు ఇవి.. కాట్రేనికోన గేటు సెంటర్లోని ఇండియన్ ఆయిల్ కంపెనీకి చెందిన పెట్రోల్ బంకులో డీజిల్ కల్తీ జరిగి అశోక్ లేలాండ్ మినీ వ్యాన్ వెహికల్ ఇంజన్ పాడైందని ప్రగడ గ్రామానికి చెందిన ఓనర్ కం డ్రైవర్ సానబోయిన తరుణ్ కాట్రేనికోన పోలీస్‌స్టేషన్‌లో, తహశీల్దారుకు మంగళవారం ఫిర్యాదు చేశారు. రూ.50 వేలకు పైగా మరమ్మతులకు అవుతుందని అతను వాపోయాడు. ఈ సంఘటనపై రెవెన్యూ పోలీస్ అధికారులు దర్యాప్తు ప్రారంభించారు. మంగళవారం ఉదయం కాట్రేనికోన పోలీస్‌స్టేషన్ ఎస్ఐ అవినాష్ విచారణ చేశారు. దీంతో ఎస్ఐ సివిల్ సప్లై అధికారులకు సమాచారం అందించగా వారు వచ్చి శాంపిలు తీసుకున్నారు.

# వివిధ కోర్సులపై విద్యార్థులకు అవగాహన

**ప్రజాశక్తి - అమలాపురం**

కెరీయర్ కౌన్సిలింగ్ గైడెన్స్ ప్రక్రియ 8, 9 ,10 తరగతుల విద్యార్థులకు విభిన్న రంగాలలో కెరీయర్ ఎంపిక, భవిష్యత్తు కొరకు దిక్సూచిగా నిలుస్తుందని జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ వెల్లడించారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్ నందు కెరీర్ గైడెన్స్ ఓరియంటేషన్ కార్యక్రమం వివిధ పాఠశాలల ఉపాధ్యాయులతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొదటి దశలో ప్రతి పాఠశాల నందు కెరీర్ ట్రీ ప్రింటింగ్ చేయించి ప్రాథమిక దశలో అవగాహన పెంచాలన్నారు. రెండవ దశలో కరప త్రాలను, బక్‌లెట్లు ముద్రించి ప్రచారం కల్పిస్తూ భవిష్యత్తు కోర్సుల ఎంపిక, ఆసక్తి ఉన్న కోర్సుల పట్ల అవగాహన కల్పించాలన్నారు. మూడో దశలో ఆన్లైన్ పోర్టల్ ద్వారా విస్తతంగా ఉన్న అవకాశాల పట్ల సమగ్రమైన అవగాహనను కల్పిస్తూ ఉజ్వల భవిష్యత్తుకు తల్లిదండ్రులు ఉపాధ్యాయుల సమన్వ యంతో మార్గ నిర్దేశం చేయాలన్నారు నవంబరు 30 నాటికి ప్రతి పాఠశాలకు పక్షం రోజులకు ఒకసారి కెరీర్ కౌన్సిలింగ్ క్లాస్ నిర్వహించేలా విధివిధానాల కార్యా చరణ ప్రణాళికలను రూపొందిం చాలన్నారు. తద్వారా విద్యార్థిని, విద్యార్థులు కెరీర్ ఆప్షన్లు ఎంపిక చేసుకోవాల్సి ఉంటుందన్నారు. డిఇఒ షేక్ సలీం బాషా ప్రసంగిస్తూకెరీర్ గైడెన్స్ రిసోర్సు పుస్తకం ద్వారా విద్యార్థులు వారి యొక్క కెరీర్ను ఎంపిక చేసుకోవడానికి అవసర మైన జ్ఞానం, నైపుణ్యాలు, వైఖరులు మరియు అర్హతలను తెలుసు కుంటారన్నారు. నైపుణ్య అభివృద్ధి కమ్యూనికేషన్, టీమ్ వర్క్ వంటి నైపుణ్యాలు వృత్తి మార్గాలు, వృత్తి నేపథ్యం, అవకాశాలు, పరిశ్రమలు, ఉద్యోగ అవకాశాలు కెరియర్ సమాచారం, వెబ్సైట్స్, సంస్థలు, ఆన్లైన్ టెస్ట్స్, హ్యాండ్ బుక్‌లు ఆప్టిట్యూడ్ అనుసరించి కెరియర్ ఎంపికలో సహాయ పడుతుందన్నారు. ప్రత్యామ్నాయ వృత్తుల గురించి అవగాహన కల్పించడం. ఆ యొక్క కోర్సులకు సంబంధించి నేర్చు కునే అవకాశాలు ఎక్కడ ఉన్నది తెలుస్తాయన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ విద్యాశాఖ అధికారి బివి.సుబ్రహ్మణ్యం, మామిడికుదురు పూర్వపు విద్యార్థి పి.నవీన్, జిల్లా సైన్స్ అధికారి సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్

## పంట నష్ట పరిహారం నమోదు

**ప్రజాశక్తి - రావులపాలెం**

మొంథా తుపాను కారణంగా నష్టపోయిన వరిచేలను మండల వ్యవసాయ అధికారులు పంట నష్టం నమోదు ప్రక్రియ మంగళవానం పూర్తి చేశారు. మండలంలో 2050హెక్టార్లలో వరిపంట సాగు చేయగా దానిలో 315 హెక్టార్లలో పంటనష్టం వాటి ల్లిందని ఈనివేదికను ఉన్నతస్థాయి అధికార్లకు పంపిస్తామన్నారు.

## తుపాను సాయం అందలేదని నిరసన

**ప్రజాశక్తి - మామిడికుదురు**

పాశర్లపూడిబాడవ కృష్ణశర్మ కాలనీకి చెందిన మహిళలు తుపాను సాయం అందించలేదంటూ మంగళవారం ప్రభుత్వ తీరుపై నిరసన తెలిపారు.బాధితులకు న్యాయం చేయాలనిడిమాండ్ చేశారు

## రోడ్డు ఆక్రమణల తొలగింపుపై సమావేశం

**ప్రజాశక్తి - రావులపాలెం**

స్థానిక మండల పరిషత్ కార్యాలయం సమావేశ మందిరంలో రోడ్డు పక్క ఆక్రమణల తొలగింపుపై మంగళవారం సమావేశం నిర్వహించారు. సిఐ శేఖర్ బాబు, ఎంపిడిఒ సిహెచ్.సుబ్రహ్మణ్యం తదితరుల ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఐఎం మేనేజర్ రమేష్, ప్రాజెక్ట్ మేనేజర్ మూర్తి పాల్గొన్నారు. ఆర్‌హెచ్ఎస్ సర్వీస్ రోడ్‌లపై ఉన్న తోపుడుబళ్ళు, వ్యాపారులు, రోడ్ సైడ్ ఆక్రమణదారుల తొలగింపు విషయమై నవంబర్ 7వ తేదీ లోపు సర్వీస్ రోడ్ పరిసరాలను పూర్తిగా స్వచ్ఛంగా, ఆక్రమణల నుంచి స్వేచ్ఛగా చేయాలని సూచించారు.

## పలు అంశాలపై విద్యార్థినులకు అవగాహన

**ప్రజాశక్తి - అమలాపురం రూరల్**

లైంగిక దాడులు తదితర ఘటనలను నివారించాలంటే కేవలం చట్టాలు కాకుండా సామాజిక అవగాహన కూడా విద్యార్థినులకు అవసరమని జిల్లా ఎస్‌సి, ఎస్‌టి విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యురాలు పుణ్యమంతుల రజిని పేర్కొన్నారు. మంగళవారం అల్లవరం మండలం గోడి బాలికలు, బాలుర గురుకుల హాస్టళ్లను కమిటీ సభ్యులు వెంట్రు సుధీర్ తో కలిసి ఆమె పరిశీలించారు. సంఘ సభ్యులు పాల్గొన్నారు.

## 'జన్ మన్'పై సమావేశం

**ప్రజాశక్తి - రావులపాలెం**

రావులపాడు పంచాయతీ వద్ద మంగళవారం సర్పంచ్ మట్టా సత్యదేవి అధ్యక్షతన పిఎం జన్ మన్ పథకంపై సమావేవం నిర్వహించారు. ఎంపిడివో సిహెచ్.సుబ్రహ్మ ణ్యం పాల్గొని ఆయన మాట్లాడారు. కలెక్టర్ ఆదేశాల మేరకు షెడ్యూల్డ్ తెగలు సమస్యలు పరిష్కారం చేసేందుకు ఈసమావేశం ఏర్పాటు చేశామన్నారు. సమావేశంలో మండల స్థాయి అధికారులు అందరూ పాల్గొన్నారు.

## ఉచిత కంప్యూటర్ శిక్షణకు దరఖాస్తుల స్వీకరణ

**ప్రజాశక్తి - ముమ్మిడివరం**

నిరుద్యోగ యువతి, యువకులకు స్కిల్ హబ్ సెంటర్ ద్వారా ఉచిత కంప్యూటర్ శిక్షణ కు ఆసక్తి ఉన్న వారి నుండి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా స్కిల్ డెవలప్మెంట్ అధికారి డి.హరిశేషు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలకు స్కిల్ హబ్ కో ఆర్డినేటర్ సెల్ నెం.83416 48470 సంప్రదించాల న్నారు.

## 6న బంద్ విజయవంతానికి పిలుపు

**ప్రజాశక్తి - రామచంద్రపురం**

రామచంద్రపురం నియోజకవర్గాన్ని కాకినాడ జిల్లాలో విలీనం చేయాలనే ప్రజల న్యాయమైన డిమాండ్‌కు మద్దతుగా ఈ నెల 6న పట్టణంలోని అన్ని విద్యాసంస్థలను బంద్ చేయాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం పిలుపునిచ్చింది. ఈ నేపథ్యంలో ప్రయివేటు స్కూల్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు మోడరన్ జివి.రావుకు బంద్ నోటీసు అందజేశారు. పిడిఎస్‌యు రాష్ట్ర సహాయ కార్యదర్శి బి. సిద్ధూ మాట్లాడుతూ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకునే దశలో ఉన్నందున ప్రజల ఈ న్యాయమైన డిమాండ్‌కు సంఘీభావంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు, ప్రజాసంఘాలు, రాజకీయ పార్టీలు పాల్గొని బంద్‌ను విజయవంతం చేయాలన్నారు. సమావేశంలో రామచంద్రపురం నియోజకవర్గ అఖిలపక్ష కన్వీనర్ మాగాపు అమ్మిరాజు, బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు దొమ్మలపాటి సత్య నారాయణ, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.భీమ శంకరం, ఐఎఫ్‌టియూ నాయకులు చింతా రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కిడ్నీ వ్యాధిగ్రస్తునికి ఆర్థిక సాయం

**ప్రజాశక్తి - రావులపాలెం**

కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న విద్యార్థికి రావులపాలెం గ్రామానికి చెందిన బోయిడి వెంకన్నబాబులక్ష్మి మంగళవారం ఆర్థిక సాయం అందించారు. కపిలేశ్వరపురం మండలపరిధి అద్దంకి వారి లంక గ్రామానికి చెందిన మానేపల్లి కార్తీక్ రావులపాలెం డిగ్రీ కాలేజీలో చదువుతున్నాడు. ఇటీవల కార్తీక్‌కి రెండు కిడ్నీలు పాడైయిపోయి కిడ్నీ మార్చుకోవాలని వైద్యులు తెలిపారు. కార్తీక్ తండ్రి హోటల్లో పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. వైద్యం చేయించే స్తోమత కార్తీక్ తండ్రికి లేకపోవడంతో మంగళవారం విక్టరీ మేనేజ్మెంట్ పార్ట్నర్ బోయిడి వెంకన్నబాబులక్ష్మి రూ.5 వేల సాయం అందజేశారు.

## స్విమ్మింగ్ పోటీల్లో దంగేరు విద్యార్థి ప్రతిభ

**ప్రజాశక్తి - రామచంద్రపురం**

రాష్ట్ర స్థాయి ఈత పోటీల్లో కె.గంగవరం మండలం దంగేరు ఉన్నతపాఠశాల విద్యార్థి బలసాడి చరణ్ ప్రతిభ కనబరిచాడు. పల్నాడు జిల్లా నరసరావుపేటలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా తరపున చరణ్ పాల్గొన్నాడు. మంగళవారం పాఠశాల హెచ్ఎం గున్నం శ్రీనివాస్, పీడీ మునాఫ్, పీడీ పంపన కనకదుర్గ, ఉపాధ్యాయులు రాయుడు సాంబశివరావు, రెడ్డి గంగరాజు, విద్యాకమిటీ ఛైర్‌పర్సన్ మల్లిపూడి సూర్య గంగభవాని, వైస్ ఛైర్‌పర్సన్ తోకల శ్రీదేవి తదితరులు విద్యార్థి చరణ్‌ను అభినందించారు.

## యుటిఎఫ్ నేత విశ్వాస్‌కుమార్ మృతి

**ప్రజాశక్తి - మండపేట**



విశ్వాస్‌కుమార్ (ఫైల్ )

పట్టణానికి చెందిన యుటిఎఫ్ సీనియర్ నాయకులు, పట్టణ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ పూర్వపు ప్రధాన కార్యదర్శి జంగా విశ్వాస్‌కుమార్(65) అనారోగ్యంతో సోమవారం రాత్రి ఆకస్మికంగా మతి చెందారు. విశ్వాస్‌కుమార్ మండపేట పట్టణంలో బాబులు మాస్టారుగా అనేక మందికి సుపరిచితులు. ఉపాధ్యాయునిగా, ఉపాధ్యాయ ఉద్యమ నాయకునిగా సేవలందిస్తూనే సామాజిక సేవా కార్యక్రమాలలో ఆయన పాల్గొనే వారు. అనేకమంది పేద విద్యార్థులను చదివించారు. 1980వ దశకంలో అనేక మంది ఉపాధ్యాయులుగా స్థిరపడడానికి ఆయన చేసిన సేవలు దోహదపడ్డాయి. యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు పి.సురేంద్రకుమార్, రాష్ట్ర మాజీ కార్యదర్శి డివి.రాఘవులు, అభ్యుదయ రచయితల సంఘం జిల్లా అధ్యక్షులు గండి స్వామిప్రసాద్, వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి వల్లూరి రామకృష్ణ, తూర్పుగోదావరి జిల్లా అధికార ప్రతినిధి పెయ్యల రాజేష్, యుటిఎఫ్ పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు గంటి వీర్రాజు, యుటిఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొవ్వూరు గోపాల కృష్ణారెడ్డి, మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు వెంటపల్లి జాన్ మార్క్ తదితరులు విశ్వాస్‌కుమార్ పార్థీవదేహానికి నివాళులర్పించారు. విశ్వాస్‌కుమార్ మృతి ఉపాధ్యాయ ఉద్యమాలకు తీరని లోటని తూర్పుగోదావరి జిల్లా ఉపాధ్యాయ ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ చైర్మన్ డివి.రాఘవులు పేర్కొన్నారు. విశ్వాస్ కుమార్ భార్య శాంతకుమారి మండపేట మున్సిపాలిటీ కో ఆప్షన్ సభ్యురాలిగా వ్యవహరిస్తున్నారు.

## ఇండియా బుక్ ఆఫ్ రికార్డుల్లో విద్యార్థికి స్థానం

**ప్రజాశక్తి - అమలాపురం**

కాట్రేనికోన మండలం కాట్రేనికోన గ్రామ విద్యార్థి విత్తనాల కుశాల్ నాగ వెంకట్ స్థానిక ఢిల్లీ పబ్లిక్ స్కూల్లో మూడో తరగతి చదువుతున్నాడని, ఇటీవల ఇండియా బుక్ఆఫ్‌రికార్డ్స్‌లో స్థానం సంపాదించాడని కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ వెల్లడించారు. ఈ చిన్నారి 195 దేశాల పేర్లు వాటి రాజధానుల పేర్లు కేవలం 2 నిమిషాల 59 సెకన్ల 11 మిల్లి సెకన్ల కాలవ్యవధిలో చెప్పి ఇండియా బుక్ ఆఫ్ రికార్డులలో అవార్డు సంపాదించాడన్నారు. స్థానిక కలెక్టరేట్ నందు కలెక్టర్ మహేష్‌కుమార్ విద్యార్థిని, విద్యన భ్యసించిన ఢిల్లీ పబ్లిక్ స్కూల్ ఉపాధ్యాయులు మంగళవారం కలిసి వారి సమక్షంలో అవార్డును బహూకరించారు. ఈ సందర్భంగా డిఇఒ షేక్ సలీం బాషా, ఢిల్లీ పబ్లిక్ స్కూల్ తరగతి సంచాలకులు నంద్యాల మనువిహార్ పాఠశాల కోఆర్డినేటర్ వర్ధిని, జిల్లా సైన్స్ అధికారి జివిఎస్. సుబ్రహ్మణ్యం విద్యార్థి వెంకట్‌ను అభినందించారు.

## వలసదారులకు కౌన్సిలింగ్

**ప్రజాశక్తి - రామచంద్రపురం**

అన్నాయిపేట గ్రామంలో ఉన్న వలసదారులకు గ్రామ సర్పంచ్ దొరబాబు కౌన్సిలింగ్ ఇచ్చారు. ఇతర ప్రాంతాల నుంచి అన్నయపేట వచ్చిన వలసదారులు ఇక్కడ గుడారాల్లో ఉంటూ పిల్లలను భిక్షాటనకు పంపిస్తున్నారు. విషయం తెలుసుకున్న సర్పంచ్ వారిని కలిసి క్షేమ సమాచారాలు తెలుసుకుని, వలసదారుల్లో ఉన్న మహిళలకు, గర్భిణులకు పిల్లల చదువు ఆవశ్యకత వివరించారు. వారిని స్కూల్‌కు పంపించే విధంగా వారి తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇచ్చారు.

## వైసిపి కోటి సంతకాల సేకరణ

**ప్రజాశక్తి - ఉప్పలగుప్తం**

కూటమి ప్రభుత్వం మెడికల్ కాలేజీల ప్రయివేటీకరణను ఆపాలని కోరుతూ మంగళవారం చల్లపల్లిలో వైసిపి మండల అధ్యక్షుడు బద్రి బాబ్జి ఆధ్వర్యంలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు.గ్రామానికి చెందిన వైసిపి రాష్ట్ర కార్యదర్శి దంగేటి రాంబాబు అధ్యక్షతన రచ్చబండ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో జడ్‌పిటిసి సభ్యుడు గెడ్డం సంపదరావు, వైసిపి రాష్ట్ర రైతు విభాగం సంయుక్త కార్యదర్శి చిక్కం బాలసుబ్రమణ్యం, మునిపల్లి సర్పంచ్ యర్రంశెట్టి రామచంద్ర రావు, ఎంపిటిసి సభ్యులు వరసాల వెంకటలక్ష్మి, కొంకి ఏడుకొండలు, నియోజకవర్గ ఎస్‌సి సెల్ అధ్యక్షుడు గెడ్డం కిరణ్ కుమార్, విలసవిల్లి వైసిపి గ్రామ కమిటీ అధ్యక్షుడు సలాది సతీష్, నాయకులు దంగేటి దొరబాబు, భోగిశెట్టి నర్సింగ్, సుంకర చిన్నకుంచే స్వామి, కోరుకొండ కిరణ్, దేవరపల్లి నానిబాబు తదితరులు పాల్గొన్నారు.




చల్లపల్లిలో నిర్వహిస్తున్న వైసిపి కోటి సంతకాల సేకరణ

# తుపాను సాయాన్ని సద్వినియోగం చేసుకోవాలి



గొల్లవిల్లిలో బాధితులకు సాయం అందజేస్తున్న సర్పంచ్ శ్రీదుర్గ

**ప్రజాశక్తి - ఉప్పలగుప్తం**

తుపాను బాధితులకు ప్రభుత్వం సమకూర్చిన సాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ జొన్నాడ శ్రీదుర్గ సూచించారు.గొల్లవిల్లి సహకార సొసైటీ వద్ద మంగళవారం తుపాను బాధితులకు 25 కేజీల బియ్యం, నిత్యావసర సరుకులను సర్పంచ్ శ్రీదుర్గ చేశారు. కార్యక్రమంలో ఎంపిటిసి సభ్యురాలు దోనిపాటి బాలమ్మ ,మాజీ సర్పంచ్ గుత్తాల సుభాష్ చంద్రరావు, సహకార సొసైటీ అధ్యక్షులు మంచెం బాలకృష్ణ, విఆర్ఒ వి.ప్రసాద్, సొసైటీ సిఇఒ మంచెం బాబి, నాయకులు పాల్గొన్నారు. అలాగే విలసవిల్లి లో సర్పంచ్ సలాది ఊర్మిళదేవి, సతీష్ 123 మంది చేనేత కార్మికులకు ఒక్కొక్కరికీ 50 కేజీల బియ్యం, నిత్యావసర సరుకులను అందజేశారు. ఈ కార్యక్రమంలో విఆర్ఒ వెంకటరమణ, నాయకులు పాల్గొన్నారు.



విలసవిల్లిలో సాయం అందజేస్తున్న సర్పంచ్ సలాది ఊర్మిళదేవి

## రామచంద్రపురం డివిజన్ జట్ల ఎంపిక

**ప్రజాశక్తి - రామచంద్రపురం**

రామచంద్రపురం కృత్తివెంటి పేర్రాజు పంతులు హైస్కూల్ క్రీడా మైదానంలో అండర్ -14, 17 బాలబాలికల కబడ్డీ, కోకో, వాలీబాల్ ఎంపికలు జరిగాయాని పిఇటి ఇంచార్జి ఆని శ్రీనివాస్ తెలియ జేశారు. రామచంద్రపురం ఉప విద్యాశాఖధికారి .రామలక్ష్మణ మూర్తి ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన ఈ ఎంపికలు ఎంఇఒ తాడి వీర్రాఘవరెడ్డి పర్యవేక్షించారు. రామచంద్రపురం, కె.గంగవరం, రాయవరం, కపిలేశ్వరపురం, మండపేట మండలాల నుండి మొత్తం 350 మంది బాలబాలికలు పాల్గొన్నారని మండలం ఇన్‌ఛార్జి లక్ష్మి శ్రీనివాస్ చెప్పారు. డివిజన్ స్థాయిలో ఎంపికైన క్రీడాకారులు త్వరలో జరగబోయే జిల్లా స్థాయి ఎంపికల్లో పాల్గొంటారు అని వ్యాయామ ఉపాధ్యాయ సంఘ కార్యదర్శి సత్య నారాయణ తెలిపారు.